
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నిండుకుండలా..



- బుగ్గవంక ప్రాజెక్టులోకి భారీగా వస్తున్న వరదనీరు
- 179.5 అడుగులకు చేరిన నీటిమట్టం
- శుక్రవారం ఉదయానికి పూర్తిగా నిండే అవకాశం
- ప్రాజెక్టును పరిశీలించిన ఎస్‌ఈ



బుగ్గవంక ప్రాజెక్టులో 179.5 అడుగులకు చేరిన నీటిమట్టం

కడప రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కడప నగర సమీపంలోని బుగ్గవంక ప్రాజెక్టు నిండుతోంది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో వారం రోజుల నుంచి బుగ్గవంక చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం 35 మి.మీ, బుధవారం 41 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో ప్రాజెక్టులోకి 179.55 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. గురువారం ఉదయం 8 గంటలకు ప్రాజెక్టులో నీటిమట్టం 179.5 అడుగులకు చేరింది. గంటగంటకు ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో శుక్రవారం ఉదయం 8 గంటలకు స్పిల్‌వే (గేట్లలెవల్‌కు) 180.5 అడుగులకు నీరు చేరనుందని అధికారులు అంచనా వేశారు. ఇదేకనుక జరిగితే ప్రాజెక్టు గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలే అవకాశం ఉంది. ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వస్తుండడంతో సంబంధిత అధికారులు గురువారం బుగ్గవంక గేట్ల పనితీరును పరిశీలించారు.

ఆగస్టు నుంచి 578 మి.మీ వర్షపాతం

ఈ వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు బుగ్గవంక ప్రాజెక్టు పరిసర ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతంలో 578 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. ఇందులో ఆగస్టు నెలలో 148 మి.మీ, సెప్టెంబరులో 210 మి.మీ నమోదైంది. అక్టోబరు నెలకు సంబంధించి గురువారం నాటికి 220 మి.మీ వర్షం కురిసింది. దీంతో అటవీప్రాంతాల్లోని చిన్నగాడి, పెద్దగాడి లోయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నీరంతా బుగ్గవంక ప్రాజెక్టులోకి చేరుతోంది.

అప్రమత్తంగా ఉండాలన్న ఎస్‌ఈ

1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బుగ్గవంక ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2000 సంవత్సరం నాటికి 0.5 టీఎంసీల సామర్థ్యంతో దీని నిర్మాణం పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీకేదిన్నె మండలంలో రైతులకు సాగునీరు, కడప నగరవాసులకు తాగునీరు అందించాలనేది లక్ష్యం. కాగా.. వర్షం నీటితో నిండుతున్న బుగ్గవంక ప్రాజెక్టును గురువారం జలవనరులశాఖ (మధ్యతరహా ప్రాజెక్టు) ఎస్‌ఈ ఎం. అబ్బు సమీ పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటి ప్రవాహం, గేట్ల పనితీరు, వాటి ట్రయల్‌రన్ తదితర విషయాలపై వాకబు చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ తెలపడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రాజెక్టులోని నీటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ తెలియచేయాలన్నారు. ఇప్పటి వరకు ప్రాజెక్టులో 179.5 అడుగులకు నీటిమట్టం చేరిందన్నారు. 183 అడుగుల వరకు నీటిని నిల్వ ఉంచే అవకాశం ఉందన్నారు.

వర్షంతో భారీ నష్టం

జమ్మలమడుగు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు కొన్ని ప్రాంతాల్లో ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు, ధర్మాపురం, చలివెందుల, దానవులపాడు, పెద్దదండ్లూరు, అంబవరం, గూడెంచెరువు, పూర్వపు బొమ్మేపల్లె తదితర గ్రామాల్లో చేతికొచ్చే సమయంలో వరిపంట నేలకొరిగింది. దీంతో రైతాంగానికి భారీ నష్టం జరిగింది. రైతులు శనగ విత్తనాలు విత్తేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. వర్షం కురవడంతో ఈ పొలాల్లో విత్తనాలు విత్తడానికి వీలుండదు. మళ్లీ పొలాలను దున్నాల్సిందే అని రైతులు అంటున్నారు. జమ్మలమడుగు వ్యవసాయాధికారి నర్రెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా తుఫాను కారణంగా వరి సాగుచేసిన రైతులకు కొందరికి భారీగా నష్టం జరిగిందన్నారు. ఒక్కొక్క రైతు పొలంలో 10 నుంచి 20-25 సెంట్ల వరకు పంట నేలకొరిగిందన్నారు. తాము పంటలను పరిశీలించామని, నిబంధనల ప్రకారం ఎకరా పొలంలో 33 సెంట్లకు పైగా నష్టం జరిగితే రిపోర్టు రాసి పంపాల్సి ఉంటుందన్నారు.



రామచంద్రాయపల్లెలో వర్షానికి కూలిపోయిన మట్టిమిద్దె



గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడు

మట్టిమిద్దె కూలి.. ఒకరికి తీవ్ర గాయాలు

మైలవరం మండలంలోని రామచంద్రాయపల్లెలో కురిసిన వానకు బుధవారం రాత్రి మట్టిమిద్దె కూలిపోయింది. ఈ ఘటనలో పట్నం చిన్నబాలసుబ్బరాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈయనను హుటాహుటిన జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం స్థానిక కాంబెల్ వైద్యశాలలో బాధితుడిని చేర్చారు. బాధితులు మాట్లాడుతూ.. రెండు అంకణాల మిద్దె కూలిపోవడంతో అందులో ఉన్న టీవీ, ఫ్రిజ్, బీరువా, ఇతర వస్తువులు పూర్తిగా దెబ్బతిని దాదాపు రూ.8 లక్షలు నష్టం జరిగిందన్నారు. చిన్నబాలసుబ్బరాయుడు తీవ్రంగా గాయపడ్డాడని అన్నారు అతడికి మెరుగైన వైద్యం అందిచేందుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. కాగా సుబ్బరాయుడు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాదుకు తరలించారు.



జమ్మలమడుగులో నేలకొరిగిన వరి పంట

శైవక్షేత్రాలకు 551 ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్



కడప మారుతీనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కడప జోన్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం 551ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కడపలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేసి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఆ మేరకు కడప జోన్ పరిధిలో గల తిరుపతి డిపో నుంచి 10 బస్సులు, చిత్తూరు 20, అన్నమయ్య 56, కడప జిల్లా నుంచి 60, కర్నూలు 110, నంద్యాల జిల్లా నుంచి 127, అనంతపురం నుంచి 66, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 102 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే బస్సుల కండిషన్‌ను మరింత మెరుగుపరిచి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిద్ధం చేశామన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. వర్షాలు కురుస్తుండటంతో జిల్లా పరిస్థితిపై మండలస్థాయి అధికారులతో ఆమె కలెక్టరేట్ నుంచి గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మండలాలవారీగా చెరువుల కట్టలు, కాలువగట్ల పరిరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. వాగులు, వంకలు, కుంటలవద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు మొదలు గ్రామస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ వారి కార్యాలయాలల్లో అందుబాటులో ఉండాలన్నారు. పంటనష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలన్నారు. ఎక్కడా పశు నష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు బాధ్యత వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అత్యవసర సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అత్యవసర సహాయ సమాచార నిమిత్తం 085622-246344 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే కంట్రోల్ రూమ్‌కు లేదా తహశీల్దారు కార్యాలయాలకు ఫోన్ చేయాలని అన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గంగనపల్లె విద్యార్థినులు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అండర్-19 స్కూలు గేమ్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు బంగారు, వెండి పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇక్బాల్, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్‌రెడ్డి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెద్దవేగి మండలం బాలయోగి గురుకుల పాఠశాలలో ఈ నెల 22 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా పోల్‌వాల్ట్ విభాగంలో వి.సుహానాఫాజియా 2.30మీటర్ల ఎత్తు దూకి బంగారు పతకం, వి.మోసిన 1.65 మీటర్ల ఎత్తు దూకి వెండిపతకం సాధించారన్నారు. దీంతో వీరు నవంబరు 26 నుంచి 30 వరకు హర్యానా రాష్ట్రం భివానీలో జరిగే 69వ జాతీయ స్థాయి స్కూలు గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.



బంగారు, వెండి పతకాలు సాధించిన గంగనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు

స్త్రీనిధి పోస్టరు ఆవిష్కరణ



పోస్టరు ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాల చెల్లింపులకు సంబంధించి స్వయం సహాయకసంఘాల సభ్యులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టరును గురువారం ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జి.రాజ్యలక్ష్మి, ఏపీడీ వీణావెంకటేశ్వరప్రసాద్, స్త్రీనిధి విభాగం అధికారులు పాల్గొన్నారు.

లంకమలలో..

అద్భుత జలపాతం

కైలాసంలోని శివుడి జటాజూటం నుంచి గంగ నేరుగా దూకుతోందా.. లేక వైకుంఠంలోని పాల సంద్రం నుంచి ఒకపాయ దారి తప్పి భువి చేరుతోందా.. అదీ కాదంటే ఆకాశమే వెండిమబ్బులను నీరుగా మార్చి నేలమీదికి జార్చిందా.. అనేలా ఉన్న ఈ జలపాతాన్ని చూడాలంటే లంకమల అడవికి వెళ్లాల్సిందే. బద్వేలు నియోజకవర్గంలోని అటవీ ప్రాంతంలో కొండల మధ్య ఉన్న లంకమల్లేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఉన్న ఎత్తైన జలపాతం అబ్బుర పరుస్తోంది. మైదుకూరు రాణిబావి మీదుగా అడవిలోని ఈ జలపాతం వద్దకు చేరుకోవచ్చు. అలాగే కడప, బద్వేలు రహదారిలోని వెంకటశెట్టిపల్లెకు పశ్చిమవైపుగా కూడా ఇక్కడికి వెళ్లచ్చు. ఇటీవల కురుస్తున్న వర్షానికి లంకమలలోని జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కార్తీకమాసం కావడంతో లంకమల్లేశ్వరుని దర్శనం కోసం వెళ్లే భక్తులు ఈ జలపాతాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు.

- బద్వేలు



మైదుకూరు రోడ్డులోని స్మార్ట్ స్ట్రీట్‌లో నిలిచిన వర్షం నీళ్లు



స్మార్ట్ స్ట్రీట్‌లో పేరుకున్న మురుగు



స్మార్ట్ అంటే.. మురుగు..!

- వైసీపీ హయాంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ
- స్మార్ట్ స్ట్రీట్‌ల కోసం రూ.కోట్లు ఖర్చు
- వర్షం వస్తే నీళ్లు కూడా పోని దుస్థితి

ప్రొద్దుటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూళ్లు చేసిన సాధారణ నిధులన్నీ కరగదీశారు. ఆఖరికి ఆర్‌అండ్‌బీ రోడ్లకు కూడా మున్సిపల్ నిధులు వెచ్చించారు. స్మార్ట్ స్ట్రీట్‌ల పేర మైదుకూరు రోడ్డు విస్తరణ చేపట్టారు. 15వ ఫైనాన్స్ నిధుల కింద రూ.1.83 కోట్లు, జనరల్ ఫండ్ కింద రూ.1.60 కోట్లు కలిపి మొత్తం రూ.3.43 కోట్లు ఖర్చు చేశారు. కానీ వర్షం వస్తే కనీసం రోడ్లపై నీళ్లపోని దుస్థితి నెలకొంది. ఇవేనా కోట్లు ఖర్చుపెట్టి చేపట్టిన స్మార్ట్ స్ట్రీట్‌లు అని జనం ముక్కున వేలేసుకునే పరిస్థితి నెలకొంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని మైదుకూరు రోడ్డు, శివాలయం రోడ్డు, కొర్రపాడు రోడ్డు, జమ్మలమడుగు రోడ్డు, ఎర్రగుంట్ల రోడ్డు... అన్నీ ఆర్‌అండ్‌బీ రోడ్లే. వీటి విస్తరణకు వైసీపీ ప్రభుత్వంలో నిధులు విడుదల చేయలేదు. దీంతో మున్సిపాలిటీ నుంచి 15 ఫైనాన్స్ నిధులు రూ.1.83 కోట్లు, జనరల్ ఫండ్ నిధులు రూ.1.60 కోట్లు ఖర్చు చేసి రోడ్ల విస్తరణ చేపట్టారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు మున్సిపాలిటీ నిధులు వెచ్చించడం నిబంధనలకు విరుద్ధం. అయినా వైసీపీ హయాంలో అడ్డదిడ్డంగా ఈ పనులు చేపట్టారని ఆరోపణలున్నాయి. మైదుకూరు రోడ్డును విస్తరించి స్మార్ట్ స్ట్రీట్ పేర ఫుట్ పాత్‌లు రోడ్డుకు రెండు అడుగుల ఎత్తులో నిర్మించారు. వర్షం కురిస్తే రోడ్లపై నీరు ఫుత్‌పాత్‌ల కింద ఉండే మురుగునీటి కాలువల్లోకి వెళ్లాలి. వీటిని అస్తవ్యస్తంగా నిర్మించడంతో పాటు కనీసం నీళ్లు వెళ్లే మార్గం లేకపోవడంతో చిన్నపాటి వర్షం వస్తే రోడ్డంతా జలమయం అవుతోంది. ఆఖరికి కాలువల్లోని బురద సైతం రోడ్డు మీద పేరుకుపోతోంది. ఈ పనులను మున్సిపాలిటీలో వైసీపీ ముఖ్య నాయకుడు తన బంధువు అయిన బినామీ కాంట్రాక్టర్ పేర చేపట్టారు. దీంతో ఈ పనుల్లో నాణ్యత కొరవడిందని జనం ఆరోపిస్తున్నారు.

విచారణ పేరుతో కాలయాపన

ప్రొద్దుటూరులో స్మార్ట్ స్ట్రీట్‌తో పాటు ఐదేళ్ల వైసీపీ పాలనలో చేపట్టిన రూ.100 కోట్ల పనుల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ పనుల పేరుతో వైసీపీ నేతలు కోట్లు కొల్లగొట్టారని ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఆరోపించారు. తమ ప్రభుత్వం వస్తే వైసీపీ అక్రమాలు బహిర్గతం చేస్తామన్నారు. ఈ మేరకు గత ఏడాది జూలై 8వ తేదీన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దాంతో నవంబరులో మున్సిపల్ ఆర్డీ నేతృత్వంలో విచారణ కమిటీలు వేసి.. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో చేపట్టిన 1100 వర్కుల ఫైల్స్‌ను, జరిగిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ ఏడాది జనవరిలో, మార్చిలో రెండు దఫాలుగా ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చినా నేటికీ చర్యలు తీసుకోలేదు. మళ్లీ ఈ నెల 9వ తేదీన విజిలెన్సు విచారణ మొదలు పెట్టింది. మున్సిపాలిటీ నుంచి ఫైల్స్‌ను, సీడీ కాపీలను స్వాధీనం చేసుకుంది. నేడో రేపో క్షేత్ర స్థాయిలో వర్కులను పరిశీలించనుంది. ఎమ్మెల్యే ఫిర్యాదు చేసి ఏడాది దాటినా విచారణ పేరుతో కాలయాపన జరుగుతోందే తప్ప.. అక్రమాలు ఎప్పటికి నిగ్గుతేలతాయో తెలియడం లేదని ప్రొద్దుటూరు ప్రజలు అంటున్నారు.



ఆక్రమణలో స్మార్ట్ స్ట్రీట్ ఫుట్‌పాత్

నిలువునా ముంచిన ముసురు

- తడిచిన బంతి, చామంతి పూలు
- ధరలు పతనం
- టమోటా రైతులకు తీరని నష్టం

బి.కొత్తకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట చుట్టుపక్కల మండలాల్లో టమోటా ప్రధానపంట. రైతుల నుదుటిరాత రాసేది ఇదే. ఈ నెల ప్రారంభం నుంచి నేలలో తేమ ఆరనీయకుండా పడుతున్న వర్షాలకు తోడు మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వాన రైతులను నిలువునా ముంచేస్తోంది. అధిక వర్షం కారణంగా టమోటా, బంతి, చామంతి లాంటి పంటలు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. చీడపీడల ప్రభావంతో పాటు, అధిక తేమశాతంతో చేతికొచ్చిన పంట చేజారిపోతుంటే నిస్సహాయ స్థితిలో బాధిత రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. చేతిలో డబ్బు వున్నా లేకపోయినా వైరస్‌లు, చీడపీడల నుంచి పంటలను కాపాడుకునేందుకు అప్పోసప్పో చేసి క్రిమిసంహారకాల స్ప్రేయింగులు చేయడం, పంట ఎదుగుదలకు డ్రిప్ ఎరువులు వదలడం చేయవచ్చు. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షంతో ఏమి చేసేదని వాపోతున్నారు.

టమోటా రైతులకు తీవ్ర నష్టం

తేమ శాతం అధికమైతే టమోటా పంట ఏ దశలో వున్నా దెబ్బతినేస్తుంది. లేత మొక్కలైతే మొదుళ్లు కుళ్లిపోతాయి, నత్తలు కొరికేస్తాయి. పూత, కాయలు పట్టిన దశలో వుంటే పూతరాలిపోతుంది. కాయలకు, కొమ్మలకు మచ్చ, గజ్జి అల్లుకుపోతుంది. పండుదశ, ఒకటి రెండు కోతలు పడిన టమోటా తోట అయితే పచ్చికాయలకు తొడిమలో పగుళ్లు (రింగ్‌అవుట్) వస్తాయి. మాగిన టమోటాలు తేమ దెబ్బకు రాలిపోతాయి. వర్షం తాకిడికి దెబ్బతిన్న కాయలను కోతకోయించి మార్కెట్‌కు తరలిస్తే అవి అమ్ముడుపోవు. ఒకవేళ అమ్మినా నామమాత్రపు ధర మాత్రమే పలుకుతాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా కుళ్లిపోయి పారబోసిన కుప్పలు, తోటలలో నేలరాలిన కాయలు, ముసురు ధాటికి ఆకులు రాలిపోయి కొమ్మలలో మిగిలిన పిందెలు దర్శనమిస్తున్నాయి. పీటీఎం, ములకలచెరువు, బి.కొత్తకోట ఇలా ఏ మండలం చూసినా వందల ఎకరాల టమోటా పంట వివిధ దశలలో దెబ్బతిన్నట్టు కనిపిస్తోంది. ఇటీవల ధరలు నిలకడగా లేకపోవడంతో పాటు, ఈ వర్షం ధాటికి దిగుబడి కూడా తగ్గిపోవడంతో టమోటా సాగు చేసిన ప్రతిరైతుకు రూ.లక్షలలో నష్టం వచ్చిందంటే అతిశయోక్తి కాదు.



మార్కెట్‌కు పనికిరాని టమోటాలను పారబోసిన దృశ్యం

దీపావళి కాంతి లేని బంతి.. చామంతి

ప్రతి ఏడాది దసరా, దీపావళికి బంతి, చామంతి పూలు మంచి ధరలు పలికి రైతులకు గిట్టుబాటు అవుతుంది. సరిగ్గా ఈ పండుగలకు కాపు వచ్చేలా పూలసాగు చేస్తారు. ఈ ఏడాది వరలక్ష్మీవ్రతం సమయంలో బాగా, దసరా ప్రారంభంలో సుమారుగా ధర పలికిన పూలు దీపావళి సమయానికి డీలా పడ్డాయి. కిలో రూ.30-40 కూడా అమ్ముడుకాక పోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తేమ లేకుండా వున్న పూలకు మాత్రమే గిరాకీ వుంటుంది. సరిగ్గా పండుగ సమయంలో ముసురు పట్టుకోవడంతో తోటల్లోని పూలన్నీ తడిచి ముద్దయ్యాయి. వీటిని మార్కెట్లకు తరలించినా ఫలితం వుండదని తోటల్లోనే వదిలేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.



నేల రాలిన టమోటాలు



ధర లేని బంతిపూలను చూపుతున్న రైతు కేశవరెడ్డి

లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేసిన జడ్జి



రాయచోటి సబ్‌జైల్లో ఖైదీలతో మాట్లాడుతున్న బాబాఫక్రుద్దీన్

రాయచోటిటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు డాక్టర్ యామిని సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, కడప సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ గురువారం రాయచోటి సబ్ జైలులో లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేసి జైలు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రాధాన్యత గురించి ఖైదీలకు తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంపై అవగాహన కల్పించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాయచోటి సబ్ జైలు సూపరిండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

భారీ వర్షానికి నేలకొరిగిన వరి పంట



నేలకొరిగి నీట మునిగిన కోతకు వచ్చిన వరిపంట

సుండుపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన వరిపంట నీటి పాలు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ముడుంపాడు, పెద్దినేనికాలువ, మాచిరెడ్డిగారిపల్లె, మడితాడుతో పాటు మరికొన్ని గ్రామ పంచాయతీల్లో సాగు చేసిన వరి పంట చేతికందే సమయానికి వర్షార్పణం అయిందన్నారు. పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీకి చెందిన నారాయణ, బాలాజీ, జయరామయ్య, హరికుమార్‌లతో పాటు మరికొంత మంది రైతులు రెండు ఎకరాలు, మూడు ఎకరాలు సాగు చేసుకుని ఉన్నారని, బుధవారం కురిసిన ఎడతెరిపిలేని వర్షం వల్ల 70 శాతం వరి పంట నేలకొరిగి నీట మునిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ముడుంపాడుకు చెందిన అమ్మునాయక్, సుబ్బరాం వరి పంట నీట మునిగింది. కోతకు వచ్చిన వరిపంట నీట మునగడంతో అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు విన్నవించారు.

నందలూరులో 62 ఎకరాల్లో పంట నష్టం



వర్షానికి నేలకొరిగిన వరిపంటను చూపుతున్న రైతు జయచంద్రారెడ్డి

నందలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో దాదాపు 62 ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. పొత్తపి, నూకినేనిపల్లె, టంగుటూరు, కుమరునిపల్లె, ఆడపూరు, పాటూరు ప్రాంతాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. ఆడపూరు గ్రామ పంచాయతీల్లోని జయచంద్రారెడ్డికి చెందిన ఐదెకరాల్లో వేసిన వరిపంట నేలకొరిగింది. ఆడపూరు ఏవో విజయకుమారి పంటనష్టాన్ని పరిశీలించారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

రైల్వేకోడూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సిగె చెన్నయ్య తెలిపారు. గురువారం డిసెంబరు 6,7 తేదీల్లో కడపలో నిర్వహించే రాష్ట్ర స్థాయి మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని, ఎక్కడ చూసినా రోడ్లు గుంతలు పడి ఉన్నాయన్నారు. దళితవాడల్లో అభివృద్ధి కరువైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య, ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యాం, వెంకటయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు న్యాయం చేయకపోతే చావే శరణ్యం

- ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు

రాయచోటిటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసులు న్యాయం చేయకపోతే తనకు చావే శరణ్యమని, తన అల్లుడికి డబ్బులు ఇప్పిస్తే సంవత్సరాల తరబడి ఇవ్వకుండా వేధిస్తున్నాడంటూ రాయచోటి పట్టణంలోని బోసనగర్‌కు చెందిన షేక్.మహమ్మద్‌హరూన్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే... అన్నమయ్య జిల్లా పరిధిలోని సంబేపల్లె మండలం దేవపట్లకు చెందిన షేక్.మహమ్మద్‌హరూన్ గత ఆరేళ్లుగా రాయచోటి పట్టణంలోని బోసనగర్‌లో నివాసం ఉంటూ చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు కాగా అందరికీ వివాహం చేశారు. ఈ క్రమంలో అతని పెద్ద కుమార్తె షహనాజ్‌ను రాయచోటి పట్టణానికి చెందిన షేక్.చాన్‌బాషా కుమారుడు ఫైరోజ్‌బాషాకు ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం చేశాడు. అయితే కూతురు, అల్లుడు ఇద్దరు కువైత్‌లో ఉంటున్నారు. అల్లుడు ఫైరోజ్‌బాషా కువైత్‌లో ఏసీలు బిగించే షాపు పెట్టుకొని వ్యాపారం నడిపేవాడని తెలిపారు. తాను కూడా తన అల్లుడి షాపులో 5 ఏళ్లు పనిచేశానని తెలిపారు. ఈ క్రమంలో గతంలో వేరే వ్యక్తుల షాపులో పనిచేసే తన అల్లుడు సొంతంగా షాపు పెట్టుకునేందుకు డబ్బులు కావాలని అడగడంతో చిన్నమండెం మండలం చాకిబండకు చెందిన నజీర్‌ఖాన్ వద్ద రూ.14 లక్షలు, సంబేపల్లెకు చెందిన సాయి అనే వ్యక్తి వద్ద రూ.5 లక్షలు, అలాగే సంబేపల్లెకు చెందిన మరో మహిళ వద్ద రూ.2 లక్షలు, రాయచోటి పట్టణానికి చెందిన గౌస్‌ఖాన్ వద్ద రూ.5 లక్షలు ఇప్పించానని ఫిర్యాదులో వివరించాడు. అయితే గత నాలుగేళ్లుగా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తన అల్లుడు ఫైరోజ్‌బాషాను డబ్బులు గట్టిగా అడిగితే మద్యం సేవించి బెట్టింగులు ఆడుతూ ఇంటికి వచ్చి తన కూతురిని ఇబ్బందులు పెడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను అనారోగ్య రీత్యా ఇబ్బందులు పడుతున్నానని, తాను పూచీ పడిన వారికి డబ్బులు ఇప్పించాలని ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు విచారించి న్యాయం చేయకపోతే తనకు ఆత్మహత్య తప్పదని షేక్.మహమ్మద్‌హరూన్ జిల్లా ఎస్పీని వేడుకుంటున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మహమ్మద్‌హరూన్

రసాభాసగా టీడీపీ సంస్థాగత ఎన్నికల అభిప్రాయ సేకరణ

పెనగలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ సంస్థాగత ఎన్నికల అభిప్రాయ సేకరణ గురువారం రసాబాసగా సాగింది. మండలంలో ఉన్న 16 పంచాయతీల్లో అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులను ఎన్నుకునేందుకు అభిప్రాయ సేకరణ నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకుడు దొడ్డపనేని రాజానాయుడు, కృష్ణచైతన్య, హేమాంబరావు, మండల పరిశీలకుడు శ్రీనాథ్‌రెడ్డి అధ్యతక్షన పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ తమకు అన్యాయం జరుగుతోందని పరిశీలకులతో వాగ్వాదానికి దిగారు. వెంటనే ఎస్ఐ డి.రవిప్రకాష్‌రెడ్డి జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఎస్ఐ కల్యాణ మండపం నుంచి అందరిని బయటకు పంపించి పంచాయతీల వారిగా పార్టీ కార్యకర్తలు, నాయకులను పిలిపించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాత్రి 7.30 గంటల వరకు సంస్థాగత పార్టీ పరిశీలకులు మాత్రం కార్యకర్తల అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి పంపించడమే తమ బాధ్యత అని స్పష్టం చేశారు. మిగతా కార్యక్రమాలను పార్టీ అధిష్టానం చూసుకుంటుందని వారికి నచ్చజెప్పారు.

అసత్య ఆరోపణలు చేసే వారిపై చర్యలు తీసుకోండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన జనసేన నాయకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నాయకులపై అసత్య ఆరోపణలు చేసే ముఠాపై తగిన చర్యలు తీసుకోవాలని గురువారం రాయచోటిలో ఎస్పీ ధీరజ్ కునిబిల్లికి ఫిర్యాదు చేసినట్లు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి సంబంధం లేని వ్యక్తులు తమ పార్టీలో ఉంటున్నామంటూ నష్టం కల్గిస్తున్నారన్నారు. ప్రత్యక్షంగా ఎఫ్‌బీ ఐడీలు, ఫేక్‌లతో పార్టీకి నష్టం కలిగించే విధంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. అసత్య ఆరోపణలతో వ్యక్తిత్వ హననం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. గతంలో రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును కూడా ఎస్పీకి వివరించామన్నారు. దీంతో స్పందించిన ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి నివేదిక తెప్పించుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. అనంతరం ఎస్పీని సత్కరించారు. కార్యక్రమంలో జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగినేని మణి, నాయకులు పగడాల చంద్రశేఖర్, ఆలం రమేష్, పగడాల వెంకటేష్, ఆనాల రమేష్ పాల్గొన్నారు.



ఎస్పీని సత్కరిస్తున్న నాయకులు


టమోటా తోటను పరిశీలించిన అధికారులు



టమోటా పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారిణి సింధూరి

గాలివీడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'తెగుళ్ల బారిన టమోటా' అనే కథనంపై గురువారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి స్పందించిన ఉద్యానవన అధికారిని సింధూరి గురువారం మండలంలోని పేరంపల్లె, గాలివీడు గ్రామాల్లో పంటను పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. కూరగాయ పంటలైన టమోటా, వంగలో అధిక వర్షాల వలన మొక్క ఎదుగుదల తగ్గుతోందని, పూత రాలడం, ఎండు తెగులు, బ్యాక్టీరియా, మచ్చ తెగులు, కాయకుళ్లు ఆశించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నివారణకు పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత వరకు త్వరగా బయటకు పంపాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే మూడు పంతొమ్ముదులు లేదా యూరియా వంటి పోషకాలను పిచికారీ చేసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలను కూడా పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన, వ్యవసాయ అధికారులు రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో వాలీబాల్ క్రీడాపోటీలు



క్రీడాకారులతో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు

రాజంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో డివిజన్ స్థాయి వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన ఎస్‌జీఎఫ్ బాలీబాల్ క్రీడా పోటీల్లో ఏడు మండలాల నుంచి ఎంపికైన 130 మంది క్రీడాకారులు అండర్-14, 16 విభాగాల్లో బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలను రాజంపేట, పుల్లంపేట మండల విద్యాశాఖాధికారులు సుబ్బరాయుడు, చక్రధర్‌రాజు గురువారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, డివిజన్ కో ఆర్డినేటర్ హమీద్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు షామీర్ బాషా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

రాయచోటి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని మురళీ రిసార్ట్‌లో గురువారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని కళా ఉత్సవ్ జిల్లా నోడల్ ఆఫీసర్ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కళా ఉత్సవ్ పోటీలకు ఎస్సీఆర్టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడం, కళల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు విద్యార్థులకు వేదికను అందించడం, ప్రాంతీయ స్థాయిలో కళలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కార్ట్ ఉపాధ్యాయులు భ్రమరాంబ, ఎబినేజర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నీటి ప్రాజెక్టుల విశ్లేషకుడు రాక

రైల్వేకోడూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జలవనరులు, సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ శనివారం రైల్వేకోడూరుకు వస్తున్నట్లు సీపీఐ సీనియర్ నాయకుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య, యువ నాయకుడు మలిశెట్టి జతిన్‌లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో నీటి పారుదల ప్రాజెక్టుల స్థితిగతులపై అధ్యయనంలో భాగంగా వారు వస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, రైతు సేవా సంస్థ అధ్యక్షుడు అక్కినేని భవానీప్రసాద్, సెంటర్ ఫర్ లిబర్టీ అధ్యక్షుడు నలమోతు చక్రవర్తిలతో కూడిన ప్రతినిధి బృందం గాలేరు-నగిరి సుజల స్రవంతి రెండో దశ నిర్మాణం, అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ ప్రాధాన్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కోడూరు, రాజంపేట, కడప ప్రాంతాల్లో ఈ నెల 25, 26 తేదీల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ప్రధాన సమావేశం నిర్వహిస్తునట్లు తెలిపారు.

పిడుగుపాటుతో గేదె మృతి



పిడుగుపాటుతో మృతి చెందిన గేదె

రామాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పాటుకు సుద్దమళ్ల పంచాయతీ దిగువ దళితవాడకు చెందిన పెదవీధి కృష్ణయ్యకు చెందిన గేదె మృతి చెందినట్లు బాధితుడు వాపోయాడు. రోజు కట్టేసే ప్రాంతంలో బర్రెను కట్టేసి ఉంచామని, సమీపంలో పిడుగు పడడంతో శబ్దానికి, వేడికి పాలు ఇచ్చే గేదె మృతి చెందిందన్నారు. తనకు ఈ గేదే జీవనాధారమని, పాలు అమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.50 వేల గేదె మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక



కండువాలు కప్పుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి గురువారం రాయచోటి పట్టణంలోని మాసాపేట రెడ్డివారిపల్లెలో 1వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు పాలంపల్లె అయ్యవారురెడ్డి ఆధ్వర్యంలో 20 కుటుంబాలు మంత్రి మండిపల్లి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు నీరాజనం పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకు వైసీపీ కార్యకర్తలతో పాటు నాయకులు కూడా వైసీపీ పార్టీపై విశ్వాసం కోల్పోతున్నారన్నారు. భవిష్యత్తులో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌వలి, టీడీపీ నాయకులు రవి, జంగం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో: మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మంత్రి స్వగృహంలో రాయచోటి వైసీపీ నాయకుడి ముఖ్య అనుచరులు ఖలీల్ బాషా, రాజేంద్రప్రసాద్‌లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఏఎంసీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బోనమల ఖాదర్‌వలి, జిలానీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని రాజంపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, ఐటీఐల జిల్లా కన్వీనర్ రామమూర్తి గురువారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో డీజిల్ మెకానిక్ 33, మోటారు మెకానిక్ 4, ఎలక్ట్రీషియన్ 4, వెల్డర్ 1, పెయింటర్ 1, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ 1 చొప్పున మొత్తం 44 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్య ర్థులు నవంబరు నెల 8వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో, వెబ్‌సైట్‌లలో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు అప్రెంటిషిప్ సలహాదారు కె.గంగయ్య 7799698809 నంబరుకు సంప్రదించాలని కోరారు.

అసాంఘికాలపై డ్రోన్‌తో ప్రత్యేక నిఘా : డీఎస్పీ

నిమ్మనపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నేరాలను పూర్తిగా అరికట్టేందుకు, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు డ్రోన్‌తో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు మదనపల్లి డీఎస్పీ మహేంద్ర తెలిపారు. గురవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నిర్మానుష్య ప్రదేశాలు, చెట్ల కింద, పాడుబడిన ప్రాంతాల్లో డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, పేకాట, గోలీలు, కోడిపందాలు, గంజాయి వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడపడం, త్రిపుల్ రైడింగ్, ఓవర్‌స్పీడ్, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు అడ్డుకట్ట వేయనున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, ట్రైనీ ఎస్ఐ శ్రీప్రియ తదితరులు పాల్గొన్నారు.

తెగనమ్ముకుంటున్నారు



పుల్లారెడ్డిపేట వద్ద రోడ్డుపై మొక్కజొన్న విక్రయాలు చేస్తున్న రైతులు

- రైతులను వెంటాడుతున్న తుఫాను భయం
- దళారులు చెప్పిన ధరకు మొక్కజొన్న విక్రయాలు

దువ్వూరు/రాజుపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎటూ నష్ట పోయాం.. వచ్చినకాడికి వస్తుందనే రీతిలో మొక్కజొన్న విత్తనాలను రైతులు తెగనమ్ముకుంటున్నారు. అగ్గికి ఆజ్యం పోసినట్లుగా గత పది రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో ఆందోళనలో ఉన్న మొక్కజొన్న రైతులను తుఫాను భయం వెంటాడుతోంది. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు పడుతాయనే హెచ్చరికలతో రోడ్లమీద ఆరబెట్టిన జొన్న విత్తనాలను మూడు రోజులుగా జోరుగా విక్రయాలు చేస్తున్నారు. వ్యాపారులు, దళారులు ఎంత ధర చెబితే అంతకే మారుమాట లేకుండా విక్రయిస్తున్నారు.

దువ్వూరు, రాజుపాళెం మండలాల్లో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు గత పది రోజులుగా వర్షానికి అష్టకష్టాలు పడుతున్నారు. వర్షం వచ్చినపుడు పట్టలు కప్పడం, తిరిగి ఆరబెట్టడం ఇదేతంతుగా మారింది. ఈ నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా జడివాన పడటం.. గురువారం కొద్దిగా తెరిపి ఇవ్వడంతో రైతులు వ్యాపారులను ఆశ్రయించి దిగుబడులను తెగనమ్ముకుంటున్నారు. రైతుల్లో నెలకొన్న ఆందోళనను గమనించిన కొందరు



కానగూడూరు వద్ద మొక్కజొన్నలు కాటా వేస్తున్న దృశ్యం

వ్యాపారులు తక్కువ ధర చెల్లించి సొమ్ము చేసుకుంటున్నారు. క్వింటాలుకు రూ.1600 నుంచి రూ.1700 దాకా ధర చెల్లించి కొనుగోలు చేపట్టారు. రైతులు చేసేది లేక కిమ్మనకుండా దిగుబడులను వ్యాపారులపరం చేస్తున్నారు. మరికొందరు మనసు ఒప్పక రోడ్లమీద అలాగే ఉంచారు. గుడిపాడు వద్ద రోడ్లమీద కనుచూపుమేర మొక్కజొన్నలను ఆరబెట్టి వర్షం భయంతో కుప్పలు చేసి వాటిపై పట్టలు కప్పి ఉంచారు.

వ్యవసాయ రంగాన్ని విస్తరించాలి



మాట్లాడుతున్న విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ

సీకేదిన్నె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని మరింతగా విస్తరించాలని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ తెలిపారు. స్థానిక ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే సాంకేతిక కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి వాటి పురోగతిపై చర్చించారు. ప్రతి శాస్త్రవేత్తకు తమ విభాగంలో సాధించాల్సిన అభివృద్ధిపై మార్గదర్శకాలను సూచించారు. రైతులకు మరిన్ని మెరుగైన సేవలను అందించాలన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా కేవలం వ్యవసాయ పంటలే కాకుండా ఉద్యాన పాడి, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకంపై దృష్టిపెట్టి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా వర్మీకంపోస్టు, పుట్టగొడుగుల పెంపకం, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపక, చిరుధాన్యాల విలువ జోడింపు కేంద్రాలను సందర్శించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం విశ్వవిద్యాలయంలో చేపడుతున్న పనులను వివరించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకరరెడ్డి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, మానస, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో పోలీసుల దాడులు

- జూదరులు, మట్కా బీటర్ల అరెస్టు
- జార్జ్‌క్లబ్‌లో తనిఖీలు



అరెస్టు చేసిన జూదరులను చూపుతున్న టూటౌన్ ఎస్‌ఐ

ప్రొద్దుటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడంలో భాగంగా గురువారం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలలో పోలీసులు దాడులు నిర్వహించారు. బుధవారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను కలిసి ఇక్కడ సాగుతున్న మట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్‌లతోపాటు క్యాసినోలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎస్పీ ఆదేశాలతో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. వన్‌టౌన్ లిమిట్స్‌లో పెన్నానగర్‌కు చెందిన షేక్ సాదక్ వలి, ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన గూగూడు అలియాస్ ఖాదర్‌వలిలు వేర్వేరు ప్రదేశాల్లో మాట్కా ఆడుతుండగా అరెస్టు చేశారు. సాదక్‌వలి వద్ద రూ.4500, ఖాదర్‌వలి వద్ద రూ.3010 నగదుతో పాటు మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిమ్మారెడ్డి తెలిపారు. అలాగే టూటౌన్ పరిధిలోని మోడంపల్లె బైపాస్ ప్రాంతంలో ఐదుగురు జూదరులను అరెస్టు చేసి, రూ.6,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. త్రీటౌన్‌పరిధిలో సీఐ వేణుగోపాల్ నేతృత్వంలో జమ్మలమడుగు రోడ్డులోని జార్జ్‌క్లబ్‌ను తనిఖీ చేశారు. అక్కడ జూదం నిర్వహించరాదని క్లబ్ నిర్వాహకులను హెచ్చరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



రౌడీషీటర్లను నడిపిస్తున్న సీఐ బాలమద్దిలేటి, పోలీసులు

సీకేదిన్నె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుని అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. ఈనెల 21వ తేదీ ఇందిరానగర్‌లో హేమంత్ అనే వ్యక్తిపై రౌడీషీటర్ చిలకలబావి చాంద్‌బాష కత్తితో దాడి చేయ డంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యా యత్నం కేసు నమోదు చేశారు. గురువారం ఇందిరానగర్ వద్ద చాంద్‌బాషాతో పాటు ఇందిరానగర్‌లోని అతని అనుచరులు ఎర్రబల్లి అబ్దుల్, షేక్ జాకీర్‌హుస్సేన్, వల్లి అలియాస్ ఖాదర్‌హుస్సేన్‌లను అరెస్టు చేశామన్నారు. అనంతరం ఇందిరానగర్ వీధుల్లో నడిపించుకుంటూ తీసుకెళ్లారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని తెలియజేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి కడప సెంట్రల్‌జైలుకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

12 మంది పేకాట రాయుళ్లు...

పులివెందుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలోని రాయలాపురం వద్ద పేకాట ఆడుతున్న 12మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేయగా పేకాట ఆడుతున్న హరికృష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డితో పాటు మరో పదిమందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.39410 స్వాధీనం చేసుకునట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పులివెందుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంరెడ్డిపల్లెకు చెందిన శ్రీరామ్(30) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. శ్రీరామ్ ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లి అక్కడే పడిపోయి మృతి చెందారు. ఈ విషయంపై సమాచారం అందడంతో ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించి, శ్రీరామ్ మృతిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆకాంక్ష లక్ష్యాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్ష లక్ష్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఐసీడీఎస్ పీడీ రమాదేవి అన్నారు. స్థానిక పీడీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన ఆకాంక్ష జిల్లాల బ్లాక్‌లకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర పోషణ అభియాన్ టిహెచ్‌ఓడి శ్రీదేవితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని వెనుకబడిన 112 జిల్లాల్లో వైఎస్ఆర్ కడప జిల్లా ఉందన్నారు. ఈ జిల్లాలో సామాజిక ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఒక కార్యక్రమం రూపొందించబడిందన్నారు. ఇందులో ఇంటి గ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంటు సర్వీసెస్ పాత్ర చాలాకీలకమైందన్నారు. ప్రధానంగా పోషకాహార లోపాన్ని తగ్గించడం, తల్లి శిశువులకు సంరక్షణ కల్పించడంతో పాటు ఆరు సంవత్సరాల్లోపు పిల్లల శారీరక మానసిక అభివృద్ధిని ప్రోత్సహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఆరు సంవత్సరాల్లోపు పిల్లలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు అనుబంధ పోషకాహార భద్రత కింద పోషకారాహార ం అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఐసీడీఎస్ కింద పిల్లలకు ప్రీస్కూలు విద్యను అందజేస్తారన్నారు. ఇది వారి పాఠశాల విద్యకు పునాది వేస్తుందని ఆమె వివరించారు. రోగనిరోధకత ఆరోగ్య తనిఖీలు అవసరమైనప్పుడు రిఫరెన్స్ సేవలందించడం వంటి ప్రాథమిక ఆరోగ్య సేవలను అంగన్వాడీ కేంద్రాలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజరు, పోషణ అభియాన్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డుల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

కమలాపురం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌యార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా పరిధిలోని పలువురు మార్కెట్‌యార్డుల కమిటీల చైర్మన్లు తెలిపారు. గురువారం కమలాపురం మార్కెట్‌యార్డులో మార్కెట్‌యార్డు చైర్మన్ రాఘవరెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీల, యార్డుల అభివృద్ధి, పాలకవర్గాల ప్రస్తుత సమస్యలు, రైతుల సంక్షేమం, రైతులకు అందిస్తున్న మద్దతు ధరల అమలు తదితర విధానాలపై చర్చించామని తెలిపారు. మార్కెట్‌యార్డుల ఆదాయం పెంపుతో పాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, జమ్మలమడుగు నాగేశ్వర్‌రెడ్డి, మైదుకూరు రవీంద్ర, బద్వేలు సుప్రజ, పులివెందుల అమర్‌నాథ్, సింహాద్రిపురం రామసూరారెడ్డి, ప్రొద్దుటూరు అధ్యక్షురాలు వద్ది సురేఖలు పాల్గొన్నారు.

ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి నవంబరు 5 వరకు అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయని వీసీ జయరామిరెడ్డి తెలిపారు. యూనివర్శిటీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు సినిమా, మీడియా, గేమింగ్, అడ్వర్టైజింగ్, డిజైన్, ఆర్ట్ గ్యాలరీలు వంటి రంగాల్లో విస్తృతమైన కెరీర్ అవకాశాలు ఉంటాయన్నారు. ఇంటర్ (ఏ గ్రూపులో అయినా) లేదా డిప్లమో పాస్ అయి ఉండాలి. ఇతర వివరాలకు 9985588105, 90524 60323 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలి - తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప-రాజంపేట- కోడూరు -రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణ పనులను 122 కిలో మీటర్ల పొడవుతో, నాలుగు వరుసల రోడ్డుగా రూ.3232 కోట్లతో మంజూరు చేసిందన్నారు. టెండర్లు అయిపోయి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడం శోచనీయమన్నారు. నిరంతర రద్దీగా ఉండే రోడ్డులో తరచూ ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయన్నారు. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం... విద్యుత్‌షాక్‌తో బర్రె మృతి



ఫెన్సింగ్ లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, చుట్టూ ఉన్న తీగజాతి మొక్కలు



మృతి చెందిన గేదె

చెన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హైవే అధికారుల నిర్లక్ష్యంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి బుధవారం ఓ గేదె షాక్‌కు గురై మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. చెన్నూరు-ఖాజీపేట మధ్య హైవేవంతెనకు కొక్కిరాయపల్లెకు వెళ్లేదారిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్‌కు హైవే అధికారులు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తీగజాతి మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారింది. ఈ నేప ధ్యం లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ట్రాన్స్ ఫార్మర్ సమీపంలోకి వెళ్లిన గేదె విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో స్థానిక రైతులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న తీగలను తొలగించాలని కోరినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే పాడి గేదె మృతి చెందిందన్నారు. బాధిత రైతు తనకు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా కొందరు హైవే సిబ్బంది చనిపోయిన పాడిగేదెకు రూ.4వేలు లేదా 5వేలు ఇస్తామని బేరసారాలకు వచ్చారని స్థానికులు చెబుతున్నారు. .

వరకట్నం వేధింపు కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో వక్కలపేటలో నివాసం ఉంటున్న రేవతికి బాలాజీనగర్‌కు చెందిన లోకేశ్‌కు మూడేళ్ల కిందట వివాహమైంది. వివాహమైనప్పటి నుంచి వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. భర్తతో పాటు అత్తమామలు, అక్కా బావ వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కడప టూటౌన్ ఎస్‌ఐ ఎస్‌కేఎం హుసేన్ ఐదుగురిపై వరకట్నం వేధింపు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర రవాణాశాఖ మంత్రిని కలిసిన ఎన్జీవోలు



మంత్రిని కలసిన ఎన్జీవో సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, కమిటీ సభ్యులు

కడప కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డిని గురువారం రాయచోటిలోని అతిథి గృహంలో కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల ఎన్జీవో సంఘానికి మూడో పర్యాయం ఎన్నికైన అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిత్యపూజయ్య, కోశాధికారి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి పద్మనాభరావులతో కూడిన నూతన కమిటీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం ముందుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగులకు డీఏ ప్రకటించారని, దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తారన్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సంఘ నాయకులకు సూచించారు. కాగా, అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగే ఏపీ ఎన్జీవో ఉద్యోగ సంఘ సమావేశానికి శుక్రవారం ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణలు హాజరు కానున్నారని ఉమ్మడిజిల్లాల అధ్యక్షుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ఉద్యోగులంతా సమావేశానికి హాజరు కావాలన్నారు.

యువకుడు అదృశ్యం



ఖాజా మొహిద్దీన్

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గుర్రం చెన్నయ్యవీధికి చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్ ప్రైవేటు జాబ్ చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. అప్పులు ఎక్కువ చేశాడు. వాటిని తీర్చలేక గత నెల 16న ఇంటి నుంచి బయటికి వెళ్లి అదృశ్యమయ్యాడు. తండ్రి మున్నా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

స్థలం కొనిస్తామంటూ.. మోసం చేశారు

- రూ.70 లక్షలు తీసుకొని స్థలం చూపలేదు..
- డబ్బులు ఇవ్వమంటే బెదిరిస్తున్నారు..
- న్యాయం చేయాలంటూ మహిళల ఆందోళన



పెట్రోలు బంకు నిర్వాహకుడి ఇంటి ముందు ఆందోళన చేస్తున్న మహిళలు

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థలం కొనిస్తామంటూ చెప్పి తమ భర్త వద్ద నుంచి రూ.70లక్షలకు పైగా డబ్బులు తీసుకుని స్థలం కొనివ్వకపోవడం.. సంవత్సరాలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడం, అడిగితే బెదిరిస్తున్నారంటూ శ్వేత అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. తమను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం ఆమె తమ బంధువులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ మేరకు కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పెట్రోలు బంకు నిర్వాహకుడి ఇంటి ఎదుట మహిళలు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న చిన్నచౌకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్తకు స్థలం ఇప్పిస్తామంటూ రూ.70 లక్షలకు పైగా తీసుకున్నాడని.. స్థలం ఇవ్వాలని అడిగితే స్థలం లేదని, దానికి బదులుగా పెట్రోలు బంకు లీజుకు ఇస్తానంటూ చెప్పాడన్నారు. తరువాత తమకు డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నాడని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై చిన్నచౌకు ఎస్‌ఐ రాజరాజేశ్వరరెడ్డిని వివరణ కోరగా.. గతంలో బాధితుల నుంచి గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు వచ్చిందని, డబ్బుల విషయం కావడంతో కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. అయితే బాధితులు ఆందోళనకు దిగిన విషయం తెలిసి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సర్దిచెప్పి పంపించామన్నారు.

అంధ పాఠశాల విద్యార్థులకు ప్రశంసలు


విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప అంధుల పాఠశాల విద్యార్థులను పాఠశాల విద్యా కమిషనర్ విజయరామ రాజు, ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రశంసించారు. గత నెల అన్నమయ్య జిల్లా రాయచోటి డైట్ కళాశాలలో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా పరిధిలో నిర్వహించిన కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలలో కడప అంధుల పాఠశాల విద్యార్థులు మహమ్మద్ సల్మాన్ (సోలో ఆర్నమెంట్స్ ప్లే), నజియా తబస్సుమ్ (సోలో సాంగ్) విభాగాలలో అగ్రస్థానంలో నిలిచారు. ఈనెల 23, 24వ తేదీలలో విజయవాడలోని మురళి కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఎస్‌ఈఆర్‌టీడీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి వీరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి, గైడ్ టీచర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దుర్మార్గం'

పులివెందుల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట వైద్య పోరాట ధర్నా పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబయ్య, జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రభుత్వం నిర్వహించకుండా ప్రైవేటుకు అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. అనంతరం పులివెందుల ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పులివెందుల ఇన్‌చార్జి బాలచంద్ర, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి టి.రవి, కదిరి ఇన్‌చార్జి రామచంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు జేబీ, ఉపాధ్యక్షురాలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నగరం జలమయం..!

ఆటోలో పర్యటిస్తూ లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవి


బేడబుడగజంగం కాలనీలో నిలిచిన వర్షపునీరు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో వర్షాల కారణంగా ఏఎస్‌ఆర్ కాలనీ, ఎన్‌ఎస్‌ఆర్ కాలనీ, ఆచారి కాలనీ, హోమియోపతి కళాశాల రోడ్ వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపునీటితో ఇళ్లు, వీధులు, రోడ్లు మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యేమాధవి తక్షణమే స్పందించి ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఆటోలో ప్రయాణిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి అవసరమైన సహాయ చర్యలు చేపటారు. అనంతరం అధికారులు, కార్పొరేషన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించి, కాల్వల శుభ్రత, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పఠాన్ మన్సూర్ అలీఖాన్, డివిజన్ ఇన్‌చార్జిలు శివారెడ్డి,పుల్లారెడ్డి, ఓబులేసు, సుబ్బరాయుడు,సమర వీరారెడ్డి,సుధాకర్, శివరామాచారి, ధూపం రాజు తదితరులు పాల్గొన్నారు.


లోహియానగర్‌లో ఇళ్ల చుట్టూ నిలిచిన వర్షం నీరు


హోమియోపతి ఆసుపత్రి రోడ్డులో వర్షపు నీరు


ఆటోలో పర్యటిస్తూ లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

అన్నదానం


అప్సరసర్కిల్ వద్ద అన్నదానం చేస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్

కడప మారుతీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెబల్ స్టార్ ప్రభాస్ 46వ జన్మదిన సందర్భంగా నగర అప్సరా సర్కిల్ వినాయకుడి గుడి వద్ద ఉమ్మడి జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకుడు హరిప్రసాద్, జన సేన నాయకులు శ్రీనివాసరాజు హాజరై అన్నదానం చేశారు. అనంతరం నగర రవి థియేటరులో కేక్ కట్ చేసి అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ ఉపాధ్యక్షులు మధురెడ్డి, రవిశంకర్‌రాజు, పవనరాజు, రాము, దివాకర్‌రెడ్డి, సాయినాగేంద్ర, శశి,శివ పలువురు ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన విజయజ్యోతి

కడప కలెక్టరేట్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైఎస్ షర్మిలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలుఎన్‌డీ.విజయజ్యోతి గురువారం విజయవాడలో కలిశారు. జిల్లాలో చేపట్టిన ఓట్ చోర్ కార్యక్రమాన్ని వివరించారు.అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలకు కాంగ్రెస్ పోటీలోఉండేలా పార్టీ బలోపేతం చేయాలని పీసీసీ అధ్యక్షురాలు సూచించినట్లు విజయజ్యోతి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్,ధ్రువకుమార్ రెడ్డి, శివమోహన్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాష పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణపై సమావేశం

పులివెందుల, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో కోటిసంతకాల కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మదన్ మోహన్‌రెడ్డి, దుష్యంత్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైపులైనుకు మరమ్మతులు

పెండ్లిమర్రి,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నందిమండలం గ్రామంలో పాత హరిజన వాడకు తాగునీటిని అందించే పైపులైను పగిలి కలుషితమవుతున్న నీరు అనే కథనం గురువారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైంది. వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి రమాదేవి పగిలిన పైపులైనుకు గురువారం మరమ్మతులు చేయించారు.





సువార్త పండుగల పోస్టర్ల ఆవిష్కరణ

కడప నాగరాజుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప సువార్త పండుగల పోస్టర్లను ఆల్ క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు, పాస్టర్లు ఆవిష్కరించారు. గురువారం హౌసింగ్ బోర్డు కాలనీలో ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్ బ్రదర్ గణేశ్ మాట్లాడుతూ నవంబరు 11, 12, 13 తేదీలలో సువార్త పండుగలు సభలు కడప సీఎస్ఐ గ్రౌండ్‌లో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెం విజయభాస్కర్, విజయ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'పర్యటనలతో ఒరిగేదేమీ లేదు'

కమలాపురం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసి పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలు చేయడం వల్ల రాష్ట్ర ప్రజలకు రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని వైసీపీ రాష్ట్ర ఎస్‌ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్యసాయినాథశర్మ తెలిపారు. కమలాపురంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వనాయకులు రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని పేద ప్రజలకు చేరువ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఎరువుల నిల్వకు రూములు ఏర్పాటు

చెన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల కోసం మండల వ్యాప్తంగా తిరగకుండా చెన్నూరులోనే రూములు ఏర్పాటు చేసి వచ్చిన ఎరువులను నిల్వ ఉంచి రైతులకు అందిస్తామని సింగిల్‌విండో అధ్యక్షుడు ముండ్ల శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఇటీవల రైతులు ఎరువుల కోసం మండలంలోనే రైతు భరోసా కేంద్రాలకు పరుగులు పెట్టాల్సి వచ్చింది. పైగా సొసైటీ తరపున ఎలాంటి రూములు ఇప్పటి వరకు లేవు. దీంతో ఈ విషయాన్ని అధ్యక్షుడు వ్యవసాయాధికారితో చర్చించి గురువారం చెన్నూరులోనే రైతులకు అనుకూలంగా ఎరువులు అందుబాటులో ఉండేటట్లుగా రూములు ఏర్పాటు చేశారు. ఈ రూముల్లో నవంబరు 1 నుంచి రైతులకు సొసైటీ ద్వారా విక్రయిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో గంగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

వేంపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పారిశుధ్యంపై దృష్టిసారించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గురువారం వేంపల్లెఈఓ నాగభూషణంరెడ్డిరెడ్డిని కలిసి మోదీ చిత్రపటాన్ని బీజేపీనాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, శివకృష్ణ, ఎర్రబోయిన రవియాదవ్, మునగల చంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలవాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మే నెలలో జరిగిన హిమాలయ వుడ్ బ్యాడ్జి ఫర్ స్కౌట్ మాస్టర్ కోర్సులో జిల్లా నుంచి స్కౌట్ మాస్టర్లు ఖాదర్ బాష, బాల సుందరం, వెంకటసుబ్బయ్య పాల్గొనడం జరిగింది. గడిచిన వారంలో సభ్యులు ముగ్గురు కూడా ఉత్తీర్ణత పొందినట్లు రాష్ట్ర కార్యదర్శి నరసింహరావు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. గురువారం జిల్లా చీఫ్ కమిషనర్, సెక్రటరీ, డీఈవో డాక్టర్ షంషుద్దీన్ ప్రత్యేక అభినందనలు తెలుపుతూ ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

లింగాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై అప్రమత్తంగా లేకపోతే సర్వం కోల్పోవాల్సి వస్తుందని రూరల్ సీఐ ఎన్వీ రమణ అన్నారు. మండలం లోని గుణకనపల్లె గ్రామంలో గురువారం సైబర్ మోసాలు, సోషల్ మీడియా, గ్యాంబ్లింగ్, ఫ్యాక్షన్‌లపై ఎస్ఐ అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని సమస్యలు పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు వివరించారు.

నూతన ఉపాధ్యాయులకు ఐడీలు కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయులకు వెంటనే ట్రెజరీ ఐడీలు కేటాయించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా ఖజానా ఉపసంచాలకుడు ఎంఎస్ వెంకటేశ్వర్లును కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు రమణ,ఎజాస్ అహ్మద్, నాయకులు గోపీనాథ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో జిల్లా విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎంఆర్‌కె మూర్తి, గుప్తా, సుబ్బారెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

28న అభినందన సభ

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీన ఉదయం 10గంటలకు కడప హరితఫంక్షన్ హాల్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జి.ఈశ్వరయ్యకు ఏర్పాటు చేసిన అభినందన సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. గురువారం కడపలో జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు.



నీటమునిగిన వరి.. రైతుల్లో వర్రీ


గోపవరంలో నీటమునిగిన వరి పంట


పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్


రాజుపాలెంలో వర్షపు నీటిలో మినుము పంట

గోపవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వా రం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట నీటమునగడంతో అన్నదాతలు ఆందోళనలో పడ్డా రు. గోపవరం మండల పరిదిలో చేతికి అందా ల్సిన పంట నీటిపాలు కావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు తలలుపట్టుకుంటున్నారు. మం డలంలోని మడకలవారిపల్లె, శ్రీనివాసపురం, కాల్వ పల్లె పంచాయతీ పరిధిలోని కాలువపల్లె, ఎర్రిచి న్నాయపల్లె, ఉప్పువారిపల్లె, లక్కువారిపల్లెల్లో దా దాపు 300 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. గత వరాం నుంచి కురుస్తున్న వర్షాలకు దాదాపు 150 ఎకరాల్లో వరి పంట వర్షార్పణం కావడంతో రైతులు గుండె పగిలేలా రోధిస్తున్నారు. వరి నాటినప్పటి నుంచి తెగుళ్లతో బాధపడి ఎన్నో మందులు వాడి కాపాడుకుంటూ వచ్చిన పంట తీరా వర్షాలు పడి నీళ్లపాలు కావడంతో ఆయా కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్లాడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేశామని, ఇప్పుడు ప్రభు త్వం మమ్మల్ని ఆదుకోకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు. లక్కువారిపల్లె లో నేలకొరిగిన వరి పంటను గురువారం మం డల తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, వ్యవసాయా ధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు లతో వారు మాట్లాడారు. పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకో వాలని రైతులు అధికారులతో మొర పెట్టుకున్నారు.

వర్షపు నీటిలో మినుము పంట

రాజుపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తు తం కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని మినుము, పాలవెన్నుతో ఉన్న వరి పంటలకు నష్టం వస్తోందని రైతన్నలు వాపోతున్నారు. కుం దూ ప్రాంతం వెంబడి ముందస్తుగా వరినారు మళ్ల వేసుకుని వరి నాటుకున్న రైతులకు ఎండు దశలో ఉండడంతో వర్షం పడడంతో నుంకు రాలడంతో పాటు వరివిత్తనాల్లో నీరు దిగడం ద్వారా వడ్ల గింజలు తాలుబోవడం జరుగుతుంద ని రైతులు తెలిపారు. అదే విధంగా తడుకు ప్రాం తాల్లో గత పదిరోజుల క్రితం వేసిన మినుము పంట వర్షంతో అధిక నీటి శాతం ఉండడం ద్వా రా మొక్కలు చనిపోతాయని రైతులు తెలిపారు. ఏదిఏమైనా గురువారం వర్షం పడకపోవడంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

రైతులు అధైర్యపడవద్దు

పోరుమామిళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు అధైర్యపడవద్దనిప్రభుత్వం అండగా ఉంటుందని మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పోరుమామిళ్లలో విలేకర్లతో మాట్లాడు తూ ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన ఈక్రాప్ చేయిం చుకున్న రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుం దన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రా లు ఏర్పాటు చేశామని వాటి ద్వారా రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబా టు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రం కూడా ధాన్యాలను కొనుగోలు చేస్తుందన్నారు. ఈక్రాప్ చేసుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందన్నారు. మద్దతు ధరకు పంట లు అమ్ముకోవాలంటే తప్పక ఈక్రాప్ నమోదుచేయించాలన్నారు. ధాన్యం నిల్వకు గోడౌన్‌లు కూడా ఏర్పాటు చేశామన్నారు.







గిరి ప్రదక్షిణకు స్పెషల్ బస్సులు ఏర్పాటు

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సంద ర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రొద్దుటూరు నుంచి స్పెషల్ బ స్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణ ప్రాంత పరిసర ప్రజల సౌకర్యార్థం కార్తీక మాసం సందర్భంగా అక్టోబరు 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి నవంబరు 4వ తేదీన మధ్యా హ్నం 1 గంటలకు ఏపీఎస్‌ఆర్‌టీసీ బస్సులు ప్రొద్దుటూరు డిపో నుంచి బయల్దేరుతాయని తెలిపారు. ఎవరైనా 35 మంది భక్తులు గ్రూపుగా సం ప్రదిస్తే వారికి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలి పారు. ఒక వ్యక్తికి రానుపోను టిక్కెట్ ధర రూ.1250గా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. టిక్కెట్ బుకింగ్ కొరకు 9966525210 నంబరుకు సంప్రదించగలరని లేదా ఏపీఎస్‌ఆర్‌టీసీ ఆన్‌లైన్.ఇన్‌లో వెబ్‌సైట్‌లో బు క్ చేసుకోగలరని తెలిపారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

మైదుకూరులో: కార్తీకమాసం సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు మైదుకూరు ఆర్టీసీ డిపో నుంఝుట స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసిన ట్లు డిపో మేనేజర్ శ్రీలత తెలిపారు. అక్టోబరు26, నవంబరు 2, 9, 16 తేదీలలో సాయంత్రం 5గంటలకు, అదేవిదంగా కార్తీకపౌర్ణమి సందర్భం గా నవంబరు 4వ తేదీన సాయంత్రం 3 గంటలకు ప్రత్యేక బస్సులు అరుణాచలంకు బయలుదేరుతాయన్నారు. ప్రయాణ చార్జీలు రాను పోనూ ఒక వ్యక్తికి రూ.1180లని తెలిపారు.ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అయ్యప్పదీక్షాపరులకు దీక్షావస్త్రాలు వితరణ


పూజా సామగ్రి దుస్తులు పంపిణీ చేస్తున్న అధ్యక్షుడు శ్రీనివాస్

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ, తెలగ, కాపు, నిత్యాన్నదాన సంఘం, బలిజ సంఘం అధ్యక్షుడు ధర్మిశెట్టి శ్రీనివాస్ (అశోక్) ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాలాధారణ ధరించిన స్వాములకు గురువారం పంచలు, టవళ్లు, మాలలు, పూజా సామగ్రి అయ్యప్పస్వామి అష్టోత్తర శతనామాల పుస్తకం పంపిణీ చేశారు. ఈసందర్భంగ అధ్యక్షుడు మాట్లాడుతూ తొలి విడతగా 80 మందికి అయ్యప్పస్వాములకు పంపిణీ చేయడం జరిగిం దని, రెండో విడత నవంబరు 15న మిగిలిన వారికి పంపిణీ చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో మేనేజరు రవి, ఆకుల రవికుమార్, గురుస్వా మి ఆకుల శివకుమార్, పలుగురాళ్లపల్లె గురుస్వామి శివయ్య, మల్లేపల్లె గురుస్వామి రమణయ్య కమిటి సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ డి గ్రీ కళాశాలకు చెందిన ఎస్.చంద్రన రసింహ జాతీయస్థాయి 6ఎ సీనియ ర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన ట్లు ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈనెల అక్టోబరు 19వ తేదీ నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో సీనియర్ రా ష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో కడ ప జట్టు ఫైనల్‌లో కర్నూలు జట్టుపై ఓడి రెండవస్థానం సంపాదించింది. ఈ క్రీడలో కడప జట్టు కెప్టెన్ చంద్రన రసింహ మంచి ప్రతిభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావ డం ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున జమ్మలమడుగు విద్యార్థి చోటు దక్కిం చుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ఆవరణలో ప్రిన్సి పాల్ దివాకర్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నవంబరు నెలలో గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో జరిగే పోటీల్లో విద్యా ర్థి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

26న గడియారం సాహిత్య పురస్కార ప్రదానం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాకవి గడియారం వేంకటశేషశాస్త్రి 44వ సాహిత్య పురస్కారాన్ని ఈనెల 26వ తేదీన ప్రదానం చేయనున్నట్లు రచయిత సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు గడి యారం వెంకటశేషశర్మ తెలిపారు. అరవిందో ఇంటిగ్రల్ హైస్కూలులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ మేరకు గురువా రం సాహిత్య పురస్కార సభ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడియారం వేంకటశేషశాస్త్రి కుటుం బీకుల ఆధ్వర్యంలో సాహిత్య రంగంలో విశేష సేవలు చేసిన వారికి గడి యారం పురస్కారం అందజేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం హైదరా బాదుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు పరిమి శ్రీరామనాధ్ రచించిన జీ వాతువు కావ్యానికి ఈ పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. కా ర్యక్రమంలో రచనా సాహిత్య వేదిక అధ్యక్షుడు విహారి, కార్యదర్శి డాక్టర్ భూతుపూరి గోపాలక్రిష్ణశాస్త్రి, ప్రముఖ కవి దస్తగిరి, మున్సిపల్ కమిషన ర్ రవిచంద్రారెడ్డి, రచయిత కొమ్మిశెట్టి మోహన్, అవధాని శారదాప్రస న్న, పాల్గొంటారన్నారు. సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న నాగ సుబ్బారెడ్డి, కార్మికులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభు త్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండిం గ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువా రం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కార్మికుల పెండింగ్ వేతనాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఉన్న 72 మంది పారిశుధ్య కార్మికు లకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదని ఇలా చేస్తే కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించా రు. నాలుగు నెలలుగా జీతాలను చెల్లించకపోవడం దారుణ మని, ఇప్పటికైనా నెల నెలా వేతనాలు చెల్లించే విధంగా చ ర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ సీ పట్టణ నాయకుడు హరి, యేసోబు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్‌లో పనిచేసే కార్మికులను రెగ్యులర్ చేయాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేసే శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్‌డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు రావడంలేదని వారికి వెంటనే జీతాలు అందేలా చూడాలని సూపరింటెండెంట్ శివక్రిష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదని గతంలో పెండింగులో ఒక నెల జీతం కూడా ఇవ్వలదన్నారు. దసరా, దీపావళి రెం డూ అయిపోయినా ఇంత వరకు కార్మికులకు జీతాలు ఇవ్వక పోవడంతో వారు అప్పుల బారిన పడ్డారన్నారు. వెంటనే వారికి జీతాలు అందేలా చూడాలన్నారు.

ఎస్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్‌టీయూ నాయకులు


మైదుకూరు అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సం ఘం(ఎస్‌టీయూ) మైదుకూరు మండలశాఖ నూతన కార్యవ ర్గాన్ని మైదుకూరులో జరిగిన రీజియన్ సమావేశంలో ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్షుడిగా జి.కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, ఆర్థికశాఖ కార్య దర్శిగా విజయనరసింహరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తా మని తెలిపారు.మాపై నమ్మకంతో అవకాశాన్ని కల్పించిన ఎస్‌టీయూ మైదుకూరు మండల, జిల్లా, రాష్ట్ర నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

జమ్మలమడుగు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని సర్పంచ్ లక్ష్మీదేవి సూచిం చారు. గురువారం ఆదర్శగ్రామమైన ఎస్.ఉప్పలపాడులో శ్రీ షిరిడీసాయి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యం లో గ్రామంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు ఎం.బి.శ్రీనివాసులరె డ్డి, కళాశాల డైరెక్టర్ సంజీవరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి విషయంలో జాగ్రత్త వహించండి


దువ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్యాంకుల ద్వారా స రఫరా జరిగే తాగునీటి విషయంలో ప్రజలు జాగ్రత్త వహిం చాలని గురువారం ఎంపీడీవో సుబ్బారెడ్డి తెలిపారు. క్లోరినేష న్ చేసిన నీటిని వాడాలని అన్నారు. కాచి వడగొట్టిన నీరు తాగాలని చెప్పారు. పైపులైన్లు లీకేజీ ఉంటే వాటిని గుర్తిం చి వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా గ్రామ పంచాయ తీల సెక్రటరీలను ఆదేశించినట్లు వివరించారు.

















కనీస వసతులు కల్పించరా..?

- దుస్థితిలో వైసీపీ హయాంలోని జగనన్న కాలనీలు
- ఆర్భాటం తప్ప ఆచరణకు నోచుకోని వైనం
- కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలంటున్న లబ్ధిదారులు



రహదారులకు నోచుకోని రంగసముద్రం పంచాయతీలోని ఓ కాలనీ

పోరుమామిళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు అనేక చోట్ల కనీస వసతులకు నోచుకోక దుస్థితిలో కొట్టుమి ట్టాడుతున్నాయి. ఇల్లు లేని పేదలకు కాలనీలు ఏర్పాటు చేసి బిల్డింగులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పిస్తామని ఆర్భాటంగా చెప్పిన అప్పటి పాలకుల హామీలు కేవలం హామీలకే పరిమితమయ్యాయి. సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా ఆయా చోట్ల నిర్మాణాలు అభివృద్ధికి నోచుకోలేదు. మరికొన్ని చోట్ల ఎత్తయిన ప్రదేశాల్లో, కొండలపై, తిప్పలపై, శ్మశానాలపై కాలనీలు ఏర్పాటు చేస్తే దానికి ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో తిరిగి వాటిని మరో ప్రాంతాలకు మార్చారు. వైసీపీ హయామంతా మాటల గారడీతోనే గడచిపోయింది. పోరుమామిళ్ల మండలంలో 12 లేఅవుట్లు వేశారు. సంచర్ల పంచాయతీలో 22 గృహాలు మంజూరు కాగా రెండు పెండింగులో ఉన్నాయి. చల్లగిరి గెలలో 22 బిల్డింగులు మంజూరు కాగా 18 పూర్తి అయ్యాయి. క్రిష్ణంపల్లెలో 17 గృహాలు మంజూరు కాగా, ఏడు పూర్తయ్యాయి. మరో 3 ఇన్‌ప్రాగ్రెస్‌లో ఉన్నాయి. ముసల్‌రెడ్డిపల్లె పంచాయ తీలో 55 గృహాలు మంజూరు కాగా 45 పూర్తి కాగా 10 పెండింగ్‌లో ఉన్నాయి. టేకూరుపేటలో 60 మందికి గృహాలు మంజూరు కాగా 35 పూర్తయ్యాయి. 25 ఇన్‌ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. కొండుగా రిపల్లెలో 26 మందికి గృహాలు మంజూరు కాగా 22 పూర్తయ్యాయి. నాలుగు ఇన్ ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. రెడ్డికొట్టాలలో 199 గృహాలు మంజూరు కాగా, 98 గృహాలు పూర్తయ్యాయి. 101 ఇన్‌ప్రొ గ్రెస్‌లో ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు సంబంధించి రెడ్డికొట్టాలలో 151 మంజూరు కాగా 85 పూర్తయ్యాయి బొప్పాపురంలో 24 మంజూరు కాగా 4 కంప్లీట్ అయ్యా యి. మండలం మొత్తం 1293 గృహాలు మంజూరు కాగా, 919గృహాలు పూర్తయ్యాయి. కాలనీలన్నిటికీ రహదారు ల నిర్మాణాలకు నోచుకోలేదు. గానుగ పెంటలో లేఅవుట్లకు సంబంధించి కొందరు సొంత స్థలా లు నిర్మాణాలు జరుపుకున్నారు. సిద్దవరంలో స్థలంలేని కారణంగా నిర్మాణాలు నోచుకోలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఈ కాలనీలకు నిధులు కేటాయించి మౌలిక వసతు లు కల్పిస్తే ప్రస్తుతం ఎన్టీఆర్ కాలనీ లుగా మా రిన ఈ కాలనీల అభివృద్ధి జరిగే అవ కాశాలు ఉంటాయని ప్రజలు కోరుతున్నారు.

మురుగునీరు మళ్లింపు

పోరుమామిళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్లపై నిలిచిన మురుగునీటిని అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. గురువారం ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి పోరుమామిళ్ల,రంగసముద్రం పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, ఓబులేసు, ఆర్అండ్‌బీ డీఈ సలీం, ఏఈ రజియాలు యంత్రాలతో ఆర్టీసీ బస్టాండు వరకు ఉన్న వర్షం నీటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు.

పెద్దబళ్లారి ఉల్లిగడ్డల కొనుగోలు ఎప్పుడో..?



క్రిస్తురాజపురం సమీపంలో వర్షపునీటితో నానుతున్న తీసిన ఉల్లిగడ్డలు

దువ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దబళ్లారి ఉల్లిని సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. పంట చేతికొచ్చిన సమయంలో వాటిని విక్రయించడం కష్టతరంగా మారింది. కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రాని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో పంట తీసేందుకు సైతం రైతులు వెనుకాడుతున్నారు. తీసిన పంటను అలాగే పొలంలో ఉంచుతున్న సంఘటనలు దువ్వూరు మండలంలో చాలా చోట్ల చోటు చేసుకుంటున్నాయి. సాగుకు వెచ్చించిన పెట్టుబడుల్లో పదవ వంతు కూడా దక్కలేదు కదా ఉల్లిగడ్డలను ఊరికే తీసుకెళ్లమనే దుస్థితి చాలా చోట్ల నెలకొంది. పొలం నుంచి పంట తీసి కొందరు, తీయక అలాగే ఉంచి మరికొందరు రైతులు ఉన్నారు. వానలు రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. దిగుబడుల కొనుగోళ్ల విషయంలో అధికారులు కరుణించాలని రైతులు కోరుతున్నారు.

ఈశ్వరయ్య నియామకం పట్ల హర్షం

కొండాపురం.అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జులఈశ్వరయ్య నియామకం పట్ల మండల సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ఈశ్వరయ్య విద్యార్థి దశ నుంచి ప్రజాసమస్యలపై పోరాడుతఊనే ఉన్నారని, ఆయన నియామకం జిల్లా ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు వెంకటరమణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించండి



అధికారులకు సూచనలు ఇస్తున్న సూపరెంటెండెంట్ ఇంజనీర్ రమణ

బద్వేలు/అట్లూరు, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లో ఓల్టేజీ సమస్యలపై ప్రజలనుంచి వచ్చేఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ రమణ తెలిపారు. గురువారం బద్వేలు విద్యుత్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను మెరుగు పరచడం సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. సిబ్బంది అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో నివాసం ఉండాలని, అత్యవసర పరిస్థితులలో స్పందించాలని, అంతరాయంలేని విద్యుత్ సరఫరా, ఫీడర్లు ట్రాన్స్‌ఫార్మర్లు పర్యవేక్షిస్తూ నిరంతరం విద్యుత్ సరఫరాకు దోహదపడాలన్నారు. లోవోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ పరిష్కారం కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించడం వలన ప్రజలు సంతృప్తి చెందుతారన్నారు. అధికారులు సిబ్బంది, ప్రజలతో పారదర్శకత, బాధ్యతాయుత సేవా ధోరణి పాటించాలన్నారు. ప్రజాధరణ స్థితిలో జిల్లాలో నే తక్కువగా బద్వేలులో 51.25 శాతంగా, అట్లూరు 46.15 శాతంగా నమోదు అయినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మిపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుళాయప్ప పాల్గొన్నారు. కాగా అట్లూరు మండలంలోని కొండూరు, మాడపూరు, కమలకూరు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలని జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ తెలిపారు. గురువారం కొండూరు సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో మండల విద్యుత్ అధికారి విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండును పరిశీలించిన డీఎం

పోరుమామిళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండును డిపో మేనేజర్ నిరంజన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ బస్టాండు పరిసరాలను పరిశీలించి అక్కడున్న చెత్త చెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సిబ్బందికి ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో స్ఫటికలింగ చరప్రతిష్ఠ మహోత్సవం



స్ఫటిక లింగానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో స్ఫటికలింగ చరప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున గణపతి పూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, యంత్రార్చన, 121 కలశాల పూజా ద్రవ్యాలతో అభిషేకం, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు మాట్లాడుతూ పూనే నుంచి తెచ్చిన స్ఫటిక లింగానికి కార్తీకమాసంలో భక్తులు అభిషేకాలు చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. ఉదయం 11 గంటల వరకు అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉప్పాగులో స్తంభించిన రాకపోకలు



ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పాగు

కాశినాయన అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి)గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉప్పాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం ప్రభావంతో మండల కేంద్రమైన నర్సాపురం ఉప్పలూరు గ్రామాల మధ్య ఉప్పాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రెండు గ్రామా ల మధ్య రాకపోకలు కొంత సేపు నిలిచిపోయాయి. కొత్త ఉప్పలూరు ,పాత ఉప్పలూరు గ్రామాల ప్రజలకు వర్షం పడిన ప్రతిసారి ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉప్పా గుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బ్రహ్మంగారిమఠంలో: ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం మండలంలో గత రెండురోజుల నుంచి వర్షం పడుతుండడంతో రోడ్లపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి బి.మఠంకు వచ్చే భక్తులు చాల వరకు తగ్గారు.

కొండాపురంలో:తుఫాను ప్రభావంతో మండలంలో గురవారం వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల రోడ్లన్నీ బురదమయ్యమయ్యాయి. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

అట్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని సోమేశ్వరపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రమణారెడ్డిని గురువారం బద్వేలు మాజీ శాసనసభ్యురాలు కె.విజయమ్మ పరామర్శించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబరు ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి రమణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయన చికిత్స పొంది ఇంటికి చేరారు. విషయం తెలుసుకున్న విజయమ్మ గురువారం ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లిఖార్జునరెడ్డి, కొండూరు సర్పంచ్ సుధారాణి, పాలకొండు సుధ, బి.కోడూరు సొసైటీ అధ్యక్షులు ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ

గోపవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం వడ్డే అగ్రహారానికి చెందిన మాజీ జడ్పీటీసీ వేముల రమణయ్య కుమారుడు వెంకటేశ్ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకుని బద్వేలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెబుతూ అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గోపవరం జడ్పీటీసీ జయరాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కొండయ్య, వైస్ ఎంపీపీ రామ్మోహన్‌రెడ్డి, గోపవరం సొసైటీ అధ్యక్షుడు రామానాయుడు, మల్లెకొండ చైర్మన్ మల్లెంకొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మొలకలు వచ్చిన మొక్క జొన్న కంకులు చూపుతున్న సీపీఐ నాయకులు, రైతులు

పోరుమామిళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాల కు నష్టపోయిన మొక్కజొన్న రైతులను రాష్ట్ర ప్రభు త్వం ఆదుకోవాలని సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, కేశవ తదితరులు డిమాండ్ చేశారు. గురు వారం వారు మొక్కజొన్న పంటలు పరిశీలించారు. టేకూరుపేట, రజాసాహెబ్‌పేట ప్రాంతాల్లో రోడ్లపైన ఆరబోసిన కంకులను పరిశీలించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ పోరుమామిళ్ల, కలసపాడు మండలాల్లో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుని ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.